సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం, 6, ఆగస్టు, 2025



భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం

నెల్లూరు(బృందావనం): రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలోని అనివెట్టి మండపంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,03,500
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,352
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,633
నవర (8 గ్రాములు)	రూ.77,064

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.1 /28.0

జిల్లాలో బుధవారం వాతావరణం ఉరుములు, మెరుపులతో పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. మంగళవారం గాలిలో తేమ 67 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఇతర జిల్లాల రైస్‌మిల్లర్లతో ధాన్యం కొనుగోళ్లు



మాట్లాడుతున్న విజయకుమార్

నెల్లూరు (పొగతోట): రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా ఇతర జిల్లాల రైస్‌మిల్లర్లతో ధాన్యాన్ని కొనుగోలు చేయించేలా చర్యలు చేపడుతున్నామని డీఎస్ఓ విజయకుమార్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో ప్రకాశం, వైఎస్సార్ కడప, తిరుపతి జిల్లాల రైస్‌మిల్లర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలాఖరు నుంచి కోతలు ప్రారంభమయ్యే అవకాశమున్న నేపథ్యంలో, జిల్లానే కాకుండా ఇతర జిల్లాల రైస్‌మిల్లర్లతో కొనుగోలు చేయించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేయనున్నామని పేర్కొన్నారు. సివిల్ సప్లయ్స్ డీఎం అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశామని..

- దౌర్జన్యంగా ఆక్రమించి రోడ్డు వేశారు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తిక్కవరపాడు గ్రామస్తులు

నెల్లూరురూరల్: గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశామనే అక్కసుతో మా పట్టా పొలంలో టీడీపీ వర్గీయులు అక్రమంగా రోడ్డు నిర్మాణం చేపట్టారని వెంకటాచలం మండలం తిక్కవరపాడు గ్రామస్తులు తమలపాకుల ఏడుకొండలు, తమలపాకుల వెంకటేశ్వర్లు, తమలపాకుల రామయ్య పేర్కొన్నారు. నగరంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తిక్కవరపాడులోని సర్వే నంబర్ 2120-2, 5, 9ల్లో 7.68 ఎకరాల విస్తీర్ణంలో తమకు వారసత్వంగా 3.48 ఎకరాల వ్యవసాయ భూమి సంక్రమించిందని తెలిపారు. మా పొలానికి చుట్టుపక్కల ఉన్న టీడీపీ నేతలు అధికార, అంగబలంతో ఈ నెల 2, 3 తేదీల్లో శని, ఆదివారాల్లో జేసీబీలు, ట్రాక్టర్లతో అక్రమంగా రోడ్డు నిర్మాణం సాగించారని వాపోయారు. ఆ సమయంలో తాము పొలం దగ్గర ఉండి ఉంటే చంపేసే వాళ్లని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు స్టే, రెవెన్యూ కోర్టు ఆర్డర్లను ధిక్కరించి రోడ్డు నిర్మాణం చేపట్టారని బాధితులు తెలిపారు. కలెక్టర్, రెవెన్యూ అధికారులు స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో బాధితులు తమలపాకుల ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, రామయ్య, పద్మమ్మ, శ్రీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరురూరల్: జిల్లాలోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో 12 ప్రాజెక్టుల పరిధిలోని 28 అంగన్‌వాడీ కార్యకర్తలు, 168 అంగన్‌వాడీ హెల్పర్లకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుంచి 26వ తేదీ సాయంత్రంలోగా అభ్యర్థులు తమ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, జూలై 2025 నాటికి 21 సంవత్సరాలు నిండి, 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. వివాహిత మహిళ అయి ఉండాలని, అవివాహితులు అనర్హులని తెలిపారు. పోస్టుల ఎంపిక ప్రక్రియ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు జరుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఏ కులం నిర్ణయించబడిందో సదరు కులానికి చెందిన వారే అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ హ్యాబిటేషన్స్‌లోని పోస్టులకు ఆయా సామాజికవర్గాలు మాత్రమే అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ హ్యాబిటేషన్‌లోని పోస్టులకు 10వ తరగతి పాసైన వారు లేని పక్షంలో ఆ తదుపరి తరుగతుల వారు అర్హులన్నారు. ఆయా ఖాళీల వివరాలను సంబంధిత గ్రామ, వార్డు సచివాలయ నోటీసు బోర్డుల్లో ప్రచురించడం జరుగుతుందన్నారు. సీడీపీఓలు పత్రిక ప్రకటనల్లో నోటిఫికేషన్ జారీ చేస్తారన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: కలిగిరిలోని పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం కిలో గరిష్ట ధర రూ.280 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 331 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 212 బేళ్లను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణాధికారి శివకుమార్ మాట్లాడుతూ కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.160 పలుకగా, సరాసరి రూ.226.79 లభించిందన్నారు. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయని వివరించారు.

కిరాయి కిల్లర్స్

.. అడ్డాగా నెల్లూరు

కళ్లల్లో మత్తు.. చేతుల్లో కత్తులు, తుపాకీలు.. మాటా మాటకే కత్తులు ఝుళిపిస్తున్నాయి. సుపారీలతో తుపాకీలు పేలుతున్నాయి. పాత కక్షలు, ఆస్తి తగాదాలు, మద్యం మత్తులో విభేదాలు నరమేధానికి ప్రేరేపిస్తున్నాయి. చిన్న గొడవలు రక్తపాతాన్ని సృష్టిస్తున్నాయి. రాత్రి పూటే కాదు పగలు కూడా రహదారుల్లో తిరగాలంటే వెన్నులో వణుకు పుడుతోంది. ఎక్కడ కత్తి కరుస్తుందో అనే ఆందోళన కనబడుతోంది. సుపారీ నేరాలు నెల్లూరు నుంచి అంతర్ జిల్లాలు, అంతర్రాష్ట్ర స్థాయి వరకు ఎగబాకాయి. ఎక్కడ నేరం జరిగినా.. నేరస్తుల మూలాలు నెల్లూరులోనే చూపిస్తున్నాయి. నేరాలను నియంత్రించాల్సిన పోలీసులు ఈ పనికి స్వస్తి పలికి.. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రత్యర్థి పార్టీ నేతలపై అక్రమ కేసులు, అరెస్ట్‌ల్లో తలమునకలు అవుతున్నారు. గడిచిన ఏడాది కాలంగా జిల్లాలో జరిగిన మారణహోమం ఇందుకు దర్పణం.

➡ ప్రకాశం జిల్లాలో టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య కేసులో నెల్లూరుకు చెందిన ఇద్దరి ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించి వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఆ ఇద్దరు యువకులు ఎవరిని హత్య చేస్తున్నారో కూడా వారికే తెలియదు. కేవలం రూ.30 వేలిచ్చి హత్య చేసేందుకు కిరాయి ముఠా పిలిపించుకుని దారుణ హత్యలో పాల్గొనేలా చేసింది. వీరు కేవలం గంజాయి మత్తు కోసం ఈ దారుణ ఘటనకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది.

➡ హైదరాబాద్‌లో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేతావత్ చందు రాథోడ్ హత్యకు గురయ్యాడు. గత నెల 15న మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లి ఇంటికి వస్తుండగా కిరాయి హంతకులు కళ్లల్లో కారం కొట్టి తుపాకీతో కాల్చి చంపారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ దారుణ హత్యలో నెల్లూరు జిల్లాకు చెందిన అర్జున్, రాంబాబు సుపారీ తీసుకుని భాగస్వామ్యం అయ్యారు. అక్కడి పోలీసులు నిందితులను కావలి సమీపంలోని మునునూరు టోల్‌గేట్ వద్ద అరెస్ట్ చేసి తీసుకెళ్లారు.

➡ గతంలో హైదరాబాద్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో జరిగిన రేవ్ పార్టీలో డ్రగ్స్ వినియోగం సమాచారంపై పోలీసులు దాడులు చేస్తే నెల్లూరుకు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కుమారుడు పట్టుబడ్డాడు. అతనే ఆర్గనైజర్‌గా తేల్చారు. జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధికి కీలక అనుచరుడు కావడంతో రంగంలోకి దిగి కేసు మాఫీ కోసం అష్టకష్టాలు పడ్డారు.

- అంతర్రాష్ట్ర స్థాయిలో నేరాల మూలాలు ఇక్కడే
- గంజాయి, మద్యం, మత్తు ఇంజెక్షన్లతో విచక్షణ కోల్పోతున్న యువకులు
- సుపారీ హత్యలకు తెగబడుతున్న యువత
- గంజాయి బ్యాచ్‌కు అధికార పార్టీ నేతల అండదండలు
- హంతకులను వెనకేసుకొస్తుండడంతో పోలీసుల మౌనం
- ఆరు నెలల్లో ఒక్క నెల్లూరులోనే 20 పైగా హత్యలు
- అక్రమ కేసులు, అరెస్ట్‌లతో నేర నియంత్రణను మరిచిన ఖాకీలు
- సింహపురిలో తిరగాలంటే భయం.. భయం



'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మత్తు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపింది. అక్రమార్కుల బెండు తీసి కటకటాల వెనక్కి నెట్టింది. జిల్లాలో నేరాలు గణనీయంగా తగ్గాయి. ప్రజలు హాయిగా జీవించారు.'

'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. జిల్లాలో క్రమేపి శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయి. విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు, బెల్టుషాపులు, మాదక ద్రవ్యాల సరఫరా పెరిగింది. నేరాలు, మారణహోమాలు మితిమీరాయి.'

సాక్షిప్రతినిధి, నెల్లూరు: జిల్లా కేంద్రం నుంచి మారుమూల ప్రాంతాల వరకు నేరప్రవృత్తి పేట్రేగి పోతోంది. ప్రధానంగా నెల్లూరు నగరంలో నేరమేధం వేళ్లూనుకుంటోంది. గంజాయి, మత్తు ఉత్ప్రేరకాలకు బానిసలైన యువత విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతోంది. వ్యసనాలను తీర్చుకునేందుకు డబ్బుల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఒంటరిగా వెళుతున్న వారిని కత్తులతో బెదిరించి అందినకాడికి దోచుకుంటున్నారు. ఎదురు తిరిగిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. ఈ పరిణామాలతో ఇళ్లు విడిచి బయటకు రావాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంటోంది. జిల్లాలో జరుగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, దాడుల్లో అధిక శాతం గంజాయి మత్తులోనే జరుగుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. నెల్లూరు నగరంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. దాడులు, దౌర్జన్యాలు, హత్యలు నిత్యకృత్యంగా మారాయి. గంజాయి దొరకని ప్రాంతం లేదు. యువత, విద్యార్థులు లక్ష్యంగా విక్రయాలు సాగిస్తున్నారు. తొలుత ఫ్యాషన్‌కు అలవాటు పడిన వారు క్రమేపి బానిసలై మత్తు లేకపోతే బతకలేని స్థితిలోకి వెళ్లిపోతున్నారు.

శివారు ప్రాంతాల్లోనే గంజాయి విక్రయాలు

నెల్లూరు నగరంలోని కపాడిపాళెం, పొర్లుకట్ట, భగత్‌సింగ్‌కాలనీ, పాతచెక్‌పోస్టు, ఎన్టీఆర్‌నగర్, హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ఏరియా, వెంగళ్‌రావునగర్, కొత్తూరు, పుత్తాఎస్టేట్, రాజీవ్‌గృహకల్ప సమీపం, విజయమహల్‌గేటు తదితర ప్రాంతాల్లో గంజాయి మత్తులో యువత నేరాలకు పాల్పడుతున్నారు. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాధితుల్లో కొందరు పోలీసులకు ఫిర్యాదులు చేస్తుండగా మరి కొందరు భయంతో పోలీసుస్టేషన్ల వరకు వెళ్లడం లేదు. ఇదే అదనుగా భావించిన కొందరు నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు.

లాఠీ దెబ్బలను మాన్పుతున్న మత్తు ఇంజెక్షన్లు

చాలా మంది యువకులు గంజాయి ఇచ్చే మత్తు చాలక, కేన్సర్ రోగులకు చివరి దశలో ఇచ్చే శక్తి వంతమైన మార్ఫిన్, పెథిడిన్, ఫోర్ట్విన్, ఫినార్గోన్ వంటి పెయిన్ కిల్లర్ ఇంజెక్షన్లు వేసుకొంటున్నారని పోలీసుల విచారణలో తేలింది. సమాచారం. వీటిని వాడడం వల్ల శరీరం మొత్తం మత్తు ఆవహించి, మొద్దుబారిపోతోంది. ఈ ఇంజెక్షన్ వేసుకున్న వారికి నొప్పి కూడా తెలియదంట. పోలీసులు లాఠీతో చావబాదినా ఈగ వాలినట్లు కూడా ఉండదని, దీంతో పోలీసులు ఎన్నిసార్లు లాఠీలు ఝుళిపించినా.. నిజాలు బయటకు రావడం లేదని తెలుస్తోంది.

మత్తు పదార్థాల విక్రయాలపై నియంత్రణేదీ?

ప్రతి నెలా నార్కోటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమన్వయ సమావేశంలో కలెక్టర్, ఎస్పీలు అన్ని శాఖల సమన్వయంతో జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూనే ఉన్నారు. వారి ఆదేశాలను బేఖాతరు చేస్తూ అధికారులు మొక్కుబడి చర్యలకే పరిమితమవుతున్నారు. అడపాదడపా దాడులతో సరిపెట్టుకుంటున్నారు. మత్తు, మాదక ద్రవ్యాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఈగల్ టీసీ జిల్లాలో లేకుండాపోయింది. అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రజల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నామని, బీట్‌లు పెంచామని, డ్రోన్లతో నిఘా పెట్టామని పోలీసులు చెబుతున్నప్పటికీ ప్రజలకు మాత్రం తగినంత భరోసా దొరకడం లేదు.

రెడ్‌బుక్ రాజ్యాంగం.. అక్రమ కేసులు, అరెస్ట్‌లు

కూటమి అధికారంలోకి వచ్చాక పోలీస్ వ్యవస్థ పూర్తిగా ప్రతిపక్ష నేతలపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసే పనిలో నిమగ్నం కావడంతో నేరస్తులు చెలరేగిపోతున్నారు. గంజాయి, మత్తు మాదక ద్రవ్యాలు, మద్యం విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలో నేరస్తులను గుర్తించి, వారిపై నిఘా ఉండడంతోపాటు వారి దినచర్యలను పర్యవేక్షించి కటకటాలపాల్జేయాల్సిన పోలీస్ యంత్రాంగం నిర్వీర్యం అయిపోయింది. ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు, అరెస్ట్‌లు, కస్టడీలు, విచారణలతో కాలక్షేపం చేస్తోంది.

ఏడాది కాలంలో జిల్లాలో ఘటనలు మచ్చుకు కొన్ని..

➡ నెల్లూరు ప్రగతినగర్‌లో గంజాయి, మద్యం మత్తులో కొందరు యువకులు కారు డ్రైవర్‌ను అతి కిరాతకంగా హత్య చేశారు.

➡ ముత్తుకూరు బస్టాండ్ వద్ద గంజాయి మత్తులో ఇద్దరు యువకులు ఓ మహిళను చంపుతామని బెదిరించి రెండు సెల్‌ఫోన్లను దోచుకెళ్లారు.

➡ తల్పగిరికాలనీ వద్ద నాగేంద్రను కత్తులతో చంపుతామని బెదిరించి అతని ఫోన్‌పే నుంచి రూ.5 వేల నగదును దుండగులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు.

➡ టిఫిన్ విషయంలో మాటామాటా పెరిగి టెంపో ట్రావెల్స్ నిర్వాహకుడు అల్లాభక్షును మత్తులో ఉన్న రంగనాయకులపేటకు చెందిన షేక్ ఇషాక్ హత్య చేశాడు.

➡ మద్యం మత్తులో మాటామాటా పెరగడంతో సుల్తాన్ అనే వ్యక్తిని ఇద్దరు హత్య చేశారు.

➡ గంజాయి మత్తులో ఉన్న కొందరు నెల్లూరు సుజాతమ్మకాలనీలోని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి విధ్వంసం సృష్టించారు.

➡ మత్తులో ఉన్న ముగ్గురు యువకులు రైల్వే స్టేషన్ వద్ద బైక్‌పై వెళుతున్న బ్యాంకు ఉద్యోగిని చంపుతామని కత్తులతో బెదిరించి నగదు దోచుకున్నారు.

➡ ఇటీవల నెల్లూరు నగరంలోని అయ్యప్ప గుడి సెంటర్‌లో ఓ యువకుడు హోటల్ కెళ్లి టిఫన్ ఆర్డర్ ఇచ్చాడు. తనకంటే వెనకున్న ఓ వ్యక్తి ఆర్డర్ ఇచ్చారు. ముందుగా తాను టిఫిన్ ఆర్డర్ ఇచ్చినా వెనకొచ్చిన వ్యక్తికి ఇచ్చాడని కారణంతో ఇద్దరు మధ్య జరిగిన చిన్న వివాదంతో దారుణంగా కత్తితో పొడిచి చంపాడు.

➡ నెల్లూరు రామలింగాపురం రైల్వే బ్రిడ్జి సమీపంలో రౌడీషీటర్ కత్తి రవి (32)ని దారుణంగా హత్య చేసిన నిందితులు.

➡ ఆర్థిక విభేదాల నేపథ్యంలో ముత్యాలపాళెంలో ఎం.పాల్ (35)ను దారుణంగా హత్య చేసిన నిందితులు.

➡ కొండాపురం మండలంలో తిరుపాల్ (55) అనే వ్యక్తిని దారుణంగా హత్య చేసి 25 మేకలను అపహరించుకెళ్లారు.

➡ ఉదయగిరిలో జనం చూస్తుండగానే వరుసకు బావను బావమరుదులే హత్య చేశారు. ఆస్తి తగాదాలే కారణం.

➡ కలువాయి మండలంలోని పల్లంకొండలో గోపి అనే యువకుడు దారుణ హత్యకు గురైయ్యాడు.

➡ కొడవలూరు మండలం టపాతోపు వద్ద హిజ్రా నాయకురాలు హాసీనిని ప్రత్యర్థులు దారుణంగా చంపారు

➡ కొడవలూరు మండలం మిక్కిలింపేట వద్ద బుచ్చిరెడ్డిపాలెంకు చెందిన స్టీల్‌వ్యాపారి రమేష్ హత్యకు గురైయ్యాడు.

➡ నెల్లూరు ఉడ్‌హౌస్ సంఘంలో సస్పెక్ట్ షీటర్ కళ్యాణ్‌ను పాతకక్షల నేపథ్యంలో హత్య చేసిన దుండగులు.

➡ ఇందిరాగాంధీనగర్‌లో రౌడీషీటర్ సుజనకృష్ణ అలియాస్ చింటూను స్నేహితులే కిరాతకంగా హత్య చేశారు.

➡ తాజాగా జాకీర్ హుస్సేన్‌నగర్ న్యూకాలనీలో మద్యం మత్తులో దూషించాడని భర్త శ్రీనివాసకుమార్‌ను హత్య చేసిన భార్య.

భూములను మింగేస్తున్న 'పోరంబోకు'లు



చదును చేసిన భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



జేసీబీతో మొక్కలను తొలగిస్తున్న ఆక్రమణదారులు


కలువాయి (సైదాపురం): అధికారమే అండగా కూటమి పార్టీల నేతలు చెలరేగిపోతున్నారు. కంటికి కనిపించిన ఇసుకనూ, మట్టినీ వదల్లేదు. ఇప్పుడు చెరువులు, అటవీ, పోరంబోకు భూములనూ కబ్జా చేస్తున్నారు. తాజాగా కలువాయి మండలం 598 సర్వే నంబర్‌లోని కుల్లూరు ఎర్ర చెరువును ఆనుకుని ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ భూములను సైతం దాదాపు 20 ఎకరాలను మంగళవారం దర్జాగా కబ్జా చేసి చదును చేశారు. అడిగేవారు ఎవరూ లేకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పుకుని గ్రామ రెవెన్యూ అధికారి సహకారంతో దర్జాగా ఎర్ర చెరువు పోరంబోకు, రిజర్వ్ ఫారెస్టు భూములను చదును చేసి చుట్టూ కంచె కూడా వేశారు. ఈ విషయంపై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి అక్కడ జరిగే పనులను అడ్డుకున్నారు. ఘటనా స్థలం నుంచి ఫారెస్ట్ అధికారులకు ఇన్‌చార్జి తహసీల్దార్ ఫోన్ చేయగా వారు స్విచ్ఛాఫ్ చేసుకుని ఉండడం గమనార్హం. దీన్ని బట్టి అటవీ శాఖ అధికారుల హస్తం కూడా గ్రామస్తులు భావిస్తున్నారు. మూడు రోజుల నుంచి ఎవరికీ తెలియకుండా బ్రాహ్మణపల్లి, వెంకటరెడ్డిపల్లి రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌లో 20 ఎకరాల భూమిని చదువు చేయడాన్ని చూసి రెవెన్యూ అధికారులు అవాక్కయారు. గ్రామ రెవెన్యూ అధికారి గ్రామంలోకి వచ్చినప్పటి నుంచి ఇటీవల కుల్లూరు గ్రామంలో భూ ఆక్రమణలు పెరిగిపోయాయిని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవల ఎర్ర చెరువు అలుగు ప్రాంతాన్ని ఆక్రమిస్తున్న విషయంపై పత్రికల్లో వచ్చిన కథనాలకు ఆత్మకూరు ఆర్డీఓ పావని స్పందించి పనులు వెంటనే ఆపాలని అప్పటి తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల మళ్లీ కూటమి నాయకులు భూములు చదును చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అందరికీ తెలిసే ప్రదేశం కాదు కాబట్టి గుట్టు చప్పుడు కాకుండా మూడు రోజుల నుంచి పనులు చకచకా చేసేస్తున్నారు. రిజర్వ్ ఫారెస్టు చెరువు పోరంబోకు పొలాల్లో ఆక్రమణలు చేపడితే చర్యలు తప్పవని ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్లు వారిని హెచ్చరించారు.

జోనల్-4 ప్రెసిడెంట్‌గా కాకాణి పూజిత



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జోన్ల వారీగా రాష్ట్ర విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజితను నెల్లూరు, ప్రకాశం, అన్నమ్మయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల(జోన్-4)కు వర్కింగ్ ప్రెసిడెంగ్‌గా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి, దాదాపు 70 రోజులుగా జిల్లా జైల్లో అక్రమ నిర్బంధంలో ఉంచింది. కాకాణిని అరెస్ట్ చేసి సర్వేపల్లిలో వైఎస్సార్‌సీపీని బలహీనపరచాలని కూటమి నేతలు భావించారు. తన తండ్రిని జైల్లో పెట్టిన తర్వాత పార్టీ కేడర్‌కు తానున్నాంటూ భరోసా కల్పిస్తూ పార్టీ నేతలకు అండగా నిలిచారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న పూజిత సేవలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తిస్తూ పార్టీ జోనల్ స్థాయిలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా పూజిత మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై పెట్టిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.

జలాశయానికి కృష్ణా జలాలు



సోమశిల జలాశయానికి వస్తున్న ఇన్‌ఫ్లో

- 36 టీఎంసీలు దాటిన సోమశిల

సోమశిల: జలాశయానికి కృష్ణా జలాల ఇన్‌ఫ్లో క్రమక్రమంగా పెరుగుతోంది. కృష్ణా జలాలు రాక ముందు 28.660 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. మంగళవారం నాటికి 36 టీఎంసీలు దాటింది. జలాశయానికి గత నెల 11వ తేదీ నుంచి వరద జలాలు వస్తున్నాయి. మంగళవారం నాటికి 14,105 క్యూసెక్కులకు చేరుకుంది. జలాశయం నుంచి పెన్నార్ డెల్టాకు క్రస్ట్‌గేట్ల ద్వారా 1100, పవర్ టర్నెల్ ద్వారా 2,500, ఉత్తరకాలువకు 370, కండలేరు కాలువకు 6 వేల క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు.

జిల్లా క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఈ నెల 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో క్రీడాపోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్‌డీఓ ఆర్కే యతిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దశల వారీగా జరిగే పోటీల్లో ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు జిల్లాస్థాయిలో క్రీడా జట్లను ఎంపిక చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన జట్లకు ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు గుంటూరులో జోనల్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. జోనల్‌లో ప్రథమ స్థానం సాధించిన క్రీడా జట్టు ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయిలో ఈ నెల 7వ తేదీన అథ్లెటిక్స్, అర్చరీ, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, కబడ్డీ పోటీలను, 8న బాస్కెట్‌బాల్, హాకీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను, 9న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలుంటాయన్నారు. అండర్-22 క్రీడాకారులు, వయస్సు ధ్రువీకరణ పత్రాలను, టెన్త్ మార్కుల జాబితా, ఆధార్ కార్డును సమర్పించి పోటీల్లో పాల్గొనాలన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు సంబంధిత తేదీల్లో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉదయం 7 గంటలకు హాజరుకావాలన్నారు. జోనల్, రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు శాప్ పూర్తి ఖర్చులు భరించి పోటీలకు పంపిస్తుందని తెలిపారు.

క్లుప్తంగా

ఆటోలో వెళ్తుండగా..

• బ్యాగ్‌లోని నగదు మాయం

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళ ఆటోలో వెళ్తుండగా బ్యాగ్‌లోని నగదు మాయమైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు హరనాథపురంలో వరలక్ష్మీదేవికి రాజరాజేశ్వరి గుడి ప్రాంతానికి చెందిన పద్మ రూ.లక్ష నగదు ఇవ్వాల్సి ఉంది. దీంతో గతనెల 21వ తేదీన ఆమె గుడివద్దకు వెళ్లగా పద్మ నగదు ఇచ్చింది. దానిని బ్యాగ్‌లో పెట్టుకుని ఆటోలో కోర్టు వద్దకు బయలుదేరింది. కొద్దిదూరం వెళ్లాక ఇద్దరు వ్యక్తులు అదే ఆటోలో ఎక్కారు. ఆమె కోర్టు వద్ద దిగి భర్తతో కలిసి ఇంటికి వెళ్లింది. భోజనం చేసిన అనంతరం బ్యాగ్‌ను తెరిచి చూడగా నగదు కనిపించలేదు. బాధితురాలు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆటోలో తనతోపాటు ప్రయాణించిన ఇద్దరు వ్యక్తులే నగదు మాయం చేసి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..

• వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన ఘటన నెల్లూరు బారాషహీద్ దర్గా సమీప స్వర్ణాల చెరువులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ప్రగతి నగర్‌కు చెందిన సుభాన్ (45) అవివాహితుడు. మటన్ అంగట్లో, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను తరచూ ఇంటికి వచ్చేవాడు కాదు. బారాషహీద్ దర్గా పరిసరాల్లో తిరుగుతూ రాత్రివేళల్లో అక్కడే ఉండేవాడు. సోమవారం ప్రమాదవశాత్తు స్వర్ణాల చెరువులో పడి మునిగిపోయాడు. మంగళవారం మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు జిలానీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


తాళం వేసిన ఇళ్లే లక్ష్యం



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై

ఉదయగిరి: పట్టణంలో సోమవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. అగ్రహారం వీధికి చెందిన షేక్ అబ్దుల్ షరీఫ్ తన కుటుంబ సభ్యులతో ఆరుళ్లలో జరుగుతున్న గంధ మహోత్సవానికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ప్రధాన ద్వారం తాళాలు ధ్వంసం చేసి ఉండటాన్ని గుర్తించి లోపలికెళ్లి పరిశీలించారు. నాలుగు బీరువాల తాళాలు తీసి రూ.70 వేలు, నాలుగు బంగారు గాజులు, ఐదు ఉంగరాలు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. కరీమావీధికి చెందిన షేక్ హుస్సేనీ కుటుంబం హైదరాబాద్‌లో ఉంటోంది. వారింట్లో కూడా గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి రూ.10 వేలు నగదు, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. క్లూస్‌టీమ్ వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే..



మారిన జీవనశైలితో పెరుగుతున్న వాస్క్యులర్ సమస్యలు

• రక్తప్రసరణ తగ్గితే ఎన్నో సమస్యలు • కొన్ని సందర్భాల్లో కాలు, వేళ్లు తీసేయాల్సిందే..

• రక్తనాళాలు సన్నబడితే గుండె ఆగిపోయే ప్రమాదం • నేడు జాతీయ వాస్క్యులర్ డే

నెల్లూరు(అర్బన్): రక్తప్రసరణ సమస్యతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోంది. షుగర్ వ్యాధి ఎక్కువగా ఉన్నవారు, పొగ తాగేవారు, అతిగా మద్యం సేవించే వారు, ఇతర అనారోగ్య సమస్యలున్న వారు సమాజంలో నిత్యం కనిపిస్తుంటారు. ఇలాంటి అలవాట్లున్న కొంతమందిలో కాళ్లు, లేదా కాలి వేళ్లు క్రమేపీ నల్లగా మారుతుంటాయి. మరికొందరిలో మానని పుండ్లు వస్తుంటాయి. వీటిని గుర్తించి సకాలంలో వైద్యసేవలందించకపోతే ఆ కాళ్లు లేదా వేళ్లు తీసివేయాల్సి ఉంటుంది. ఇలా శరీర భాగాలను తొలగించడాన్ని వైద్య పరిభాషలో యాంపుటేషన్ అంటారు. దీనికి ప్రధాన కారణం రక్తనాళాలు (వాస్క్యులర్)లో రక్తప్రసరణ సక్రమంగా జరగకపోవడమే. రక్తనాళాలు సన్నబడిపోతాయి. ఈ పరిస్థితిని గమనించిన వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం ఆగస్టు 6వ తేదీన నేషనల్ వాస్క్యులర్ డేని నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తెస్తోంది. అందులో భాగంగా నెల్లూరులో బుధవారం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎన్నో కారణాలు

జీవనశైలిలో మార్పుల కారణంగా రక్తప్రసరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. పొగ తాగడం వల్ల అందులోని హానికర నికోటిన్, ఇతర రసాయనాలు రక్తనాళాలు కుచించుకుపోయేలా చేస్తాయి. నికోటిన్ రక్తాన్ని చిక్కబడేలా చేస్తుంది. తద్వారా రక్త ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతాయి. షుగర్ వ్యాధి రక్తనాళాల్లో కొలెస్ట్రాల్‌ను పేరుకు పోయేలా చేస్తుంది. అందువల్ల రక్తనాళాలు మరింత సన్నబడతాయి. జంక్‌ఫుడ్స్, ఊబకాయం, బీపీ లాంటి కారణాలు మనిషి రక్త ప్రసరణకు ఆటంకాలుగా మారుతున్నాయి. ఫలితంగా రక్త ప్రసరణ రక్తనాళాల్లో తగ్గుతుంది. అధిక ఒత్తిడి, వ్యాయామం లేకపోవడంతో రక్తప్రసరణ సమస్యలు వస్తాయి.

పదిశాతం

జిల్లాలో సుమారు 10 శాతం మంది ప్రజలు రక్తప్రసరణ తగ్గడంతో అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒక్కో దఫా గుండె రక్తనాళాలు కుచించుకుపోవడంతో ఇస్కీమిక్ హార్ట్ జబ్బులు వస్తున్నాయి. ఫలితంగా గుండెపోటు వచ్చి కుప్పకూలిపోతున్నారు. ఊపిరితిత్తుల నాళాలు సన్నబడితే పల్మనరీ వాస్క్యులర్ సమస్యలు వస్తున్నాయి. ఊపిరితిత్తులు పాడైపోతున్నాయి. రక్తప్రసరణ సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా కృషి చేస్తోంది.

ఎలా గుర్తించాలంటే..

కొంతదూరం నడిస్తే కాళ్లలో నొప్పి, తిమ్మిర్లు వచ్చి ఆగాల్సి రావడం, పనిచేస్తే చేతుల్లో, చేతి వేళ్లలో నొప్పులు వస్తే రక్త ప్రసరణ తగ్గుతుందని భావించాలి. వేళ్లలో విపరీతమైన మంట వచ్చి నిద్రపట్టకపోవడం. వేళ్లు నల్లబడటం, పుండ్లు రావడం, కాళ్లకు మానని గాయాలు కావడం, పాదాలు నల్లబడటం లాంటి లక్షణాలుంటే రక్త ప్రసరణ తగ్గిపోతున్నట్టు అర్థం.

అవగాహనతో చెక్



రక్తనాళాల్లో రక్తప్రసరణ తగ్గితే వచ్చే మార్పులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. అధిక బీపీ, షుగర్, కొలెస్ట్రాల్, ఊబకాయం ఉన్నవారు, ధూమపానం, మద్యపానం చేసేవారు వాస్క్యులర్ సర్జన్‌ను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి. ప్రధానంగా 45 సంవత్సరాలు నిండిన వారు క్రమం తప్పకుండా రక్త ప్రసరణకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవడం మంచిది. లక్షణాలున్నట్టు గుర్తిస్తే చికిత్స పొందాలి. దీంతో కాళ్లు, వేళ్లను తొలగించాల్సిన పరిస్థితి ఉండదు. ప్రారంభంలోనే గుర్తిస్తే కేవలం మాత్రల ద్వారానే వాస్క్యులర్ సమస్యలు తగ్గించవచ్చు. రోజూ కనీసం 20 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, ధూమపానం నిలిపి వేయడం ద్వారా రక్త ప్రసరణ మెరుగు పరుచుకోవచ్చు.

– డాక్టర్ వై.సుదర్శన్‌రెడ్డి, వాస్క్యులర్ సర్జన్, మెడికవర్ ఆస్పత్రి

ఎల్లో మీడియాది దుష్ప్రచారం

• అజిత్‌కుమార్‌రెడ్డి టీడీపీ అభ్యర్థుల కోసం పనిచేశాడు

• విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

కందుకూరు: ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో పోలీసులు అరెస్ట్ చేసిన ఉలవపాడు మండలం కరేడు గ్రామానికి చెందిన నల్లపరెడ్డి అజిత్ కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకుడంటూ ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందని ఆ పార్టీ నేతలు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అజిత్‌కుమార్‌రెడ్డి గత ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోసం ఉలవపాడు మండలంలో అనుచరులతో కలిసి ప్రచారం నిర్వహించారన్నారు. తెలుగుదేశం అభ్యర్థుల కోసం పనిచేశారనేది బహిరంగ రహస్యమేనన్నారు. అతను అజిత్‌కుమార్‌రెడ్డి ఏడాదిన్నర కాలంగా వైఎస్సార్‌సీపీకి దూరంగా ఉంటున్నారని, ప్రస్తుత నియోజకవర్గ సమన్వయకర్త బుర్రా మధుసూదన్ యాదవ్‌ను అతను ఇప్పటి వరకు కలిసిన దాఖలాల్లేవని స్పష్టం చేశారు. అసత్య ప్రచారం మాని వాస్తవాలు తెలుసుకో వాలన్నారు. సమావేశంలో కార్యక్రమంలో ఉలవపాడు మండలాధ్యక్షుడు నన్నం పోతురాజు, జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిశోర్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెలిచర్ల ధనకోటి, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు పాలవల్లి అమరనాథరెడ్డి, యువజన అధ్యక్షుడు మద్దసాని నవీన్‌కృష్ణయాదవ్, సోషల్ మీడియా అధ్యక్షుడు కాపులూరి మధుసూదన్, సీనియర్ నాయకులు అమ్మనబ్రోలు బ్రహ్మయ్య, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు ఆలూరి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 25.482 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 25.482 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల నుంచి కండలేరుకు 725 క్యూసెకుకల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,750, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 90, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.107
లేయర్	రూ.112
బ్రాయిలర్ చికెన్:	రూ.200
స్కిన్‌లెస్ చికెన్:	రూ.222
లేయర్ చికెన్:	రూ.190

గ్రామంలో ఉన్నారని..

• సీపీఎం నేతల్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు



ఉలవపాడు పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

ఉలవపాడు: 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్న రామకృష్ణాపురం గ్రామంలో తిరుగుతున్నారని సీపీఎం నాయకులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ గ్రామంలో ఇంటింటి సర్వే జరుగుతోంది. సర్వే అవసరం లేదు.. డాక్యుమెంట్లు ఇవ్వొద్దని గిరిజనులకు నేతలు చెబుతున్న సమయంలో 20 మంది పోలీసులు వచ్చి స్టేషన్‌కు తరలించారు. వారిలో సీపీఎం ఉలవపాడు ప్రాంతీయ కార్యదర్శి జీవీబీ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాకార్యదర్శి పుల్లయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య ఉన్నారు. తర్వాత పూచీకత్తుపై విడుదల చేశారు.

హైవేపై రోడ్డు ప్రమాదం

• ఒకరి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు



రాజేంద్ర (ఫైల్)



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

వరికుంటపాడు: మండలంలోని భోగ్యంవారిపల్లె సమీపంలో 565 జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన పూల రాజేంద్ర (44) తన బంధువులతో కలిసి శ్రీశైలం నుంచి నెల్లూరుకు కారులో వస్తున్నారు. దుత్తలూరు నుంచి ఒంగోలుకి మరో కారు వెళ్తోంది. భోగ్యంవారిపల్లి సమీపానికి వచ్చేసరికి రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రాజేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న వరికుంటపాడు ఎస్సై ఎం.రఘునాథ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కరేడు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉలవపాడు: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ అధ్యాపకులు శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. జూనియర్స్ విభాగంలో కంబోతు గాయత్రి, జి.హృదయ సందేశ్, సబ్ జూనియర్స్‌లో దొడ్డ యోషితారెడ్డి, కె.నిహాల్, టి.ఉపదేశ్‌లు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 29, 30, 31వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో నెల్లూరు జిల్లా తరఫున పాల్గొంటారన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.25
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైమ్): ఓ కార్యాలయంలో చోరీకి పాల్పడిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. రంగనాయకులపేట మహాలక్ష్మమ్మగుడి సమీపంలో నివాసం ఉండే పి.జిలానీబాషాకు కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు ప్రాంతానికి చెందిన పి.అష్రఫ్ ఖాన్ వరుసకు తమ్ముడు. జిలానీ నెల్లూరు రూరల్ మండలం జీవీఆర్‌ఆర్ కళాశాల సమీపంలో ఖాన్ ప్రాపర్టీస్ కార్యాలయం నిర్వహిస్తున్నాడు. కుదువలో ఉన్న తన 50 గ్రాముల బంగారు ఆభరణాలను ఈనెల ఒకటో తేదీన విడిపించాడు. ఆభరణాలతోపాటు రూ.50 వేల నగదును బ్యాగ్‌లో పెట్టి కార్యాలయంలోని కప్‌బోర్డులో ఉంచాడు. ఆ సమయంలో అష్రఫ్ ఖాన్ సైతం అతడి వెంట ఉన్నాడు. అనంతరం ఇద్దరూ బయటకు వెళ్లిపోయారు. మరుసటి రోజు సాయంత్రం జిలానీ కార్యాలయానికి రాగా బ్యాగ్ కనిపించలేదు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగతనం చేసింది అష్రఫ్ ఖాన్, అతడికి సన్నిహితుడైన బాలు డిగా గుర్తించారు. మంగళవారం గొలగమూడి క్రాస్‌రోడ్డుకు కొద్దిదూరంలోని ఓ స్కూల్ సమీపంలో వారి అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. 50 గ్రాముల బంగారు ఆభరణాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అష్రఫ్‌ను అరెస్ట్ చేయగా బాలుడిని జువనైల్ హోంకు తరలించారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్, ఎస్సై నవీన్, పీఎస్సై సాయికల్యాణ్, సిబ్బందిని నగర డీఎస్పీ సింధుప్రియ అభినందించారు.

5 నెలలు.. 11 కేసులు

• రైళ్లలో పెద్ద ఎత్తున గంజాయి అక్రమ రవాణా

• తనిఖీలు చేపట్టిన రైల్వే పోలీసులు

• 96 కేజీల గంజాయి స్వాధీనం



పట్టుబడిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయి వివరాలను తెలియజేస్తున్న సీఐ సుధాకర్ (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు రైల్వే పోలీసులు చర్యలు తీసుకున్నారు. రైళ్లు, రైల్వేస్టేషన్లలో తనిఖీలు నిర్వహిస్తూ అక్రమార్కులను అరెస్ట్ చేసి సరుకును స్వాధీనం చేసుకుంటున్నారు. ఒడిశా, ఏఓబీ సరిహద్దు ప్రాంతాల నుంచి జిల్లా మీదుగా తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు రోడ్డు, రైలు మార్గాన గంజాయి పెద్దఎత్తున తరలివెళ్తోంది. అక్రమార్కులు ఒడిశా, ఏఓబీ ప్రాంతాల్లో కేజీ రూ.3 వేల చొప్పున కొనుగోలు చేసి తమ ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇతర రాష్ట్రాలకు..

ఒడిశా, విశాఖ వైపు నుంచి తిరుపతి, చెన్నై, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లే రైళ్లలో అక్రమ రవాణా సాగుతోందని నెల్లూరు రైల్వే పోలీసులు గుర్తించారు. డీఎస్పీ జి.మురళీధర్ పర్యవేక్షణలో సీఐ ఎ.సుధాకర్ ఆర్పీఎఫ్, స్థానిక పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రైళ్లు, జిల్లాలోని కావలి, నెల్లూరు, గూడూరు రైల్వేస్టేషన్‌లలో తనిఖీలు ముమ్మరం చేశారు. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని ఎక్కడ? ఎవరి వద్ద కొనుగోలు చేశారు? ఎవరికి సరఫరా చేస్తున్నారు? ఏ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు? తదితర వివరాలను సేకరించి అరెస్ట్‌లు చేస్తున్నారు. సరఫరాదారులపై సైతం కేసులు నమోదు చేస్తున్నారు.

కేసులిలా..

గడిచిన ఐదునెలల్లో గంజాయి అక్రమ రవాణాపై కావలిలో రెండు, నెల్లూరులో ఆరు, గూడూరులో మూడు కేసులు నమోదు చేశారు. మొత్తంగా 11 కేసులు నమోదు చేసి 96 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని 14 మంది నిందితులను అరెస్ట్‌చేశారు. నిందితులందరూ దాదాపు ఇతర రాష్ట్రాలకు చెందినవారే. అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేసేంత వరకూ తనిఖీలు కొనసాగిస్తామని సీఐ ఎ.సుధాకర్ తెలిపారు. అదేక్రమంలో రైళ్లలో మత్తు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972, లేదా 139 నంబర్‌కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని సూచిస్తున్నారు.



రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)